## బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా ఆదిరెడ్డి



సీఐ ఆదిరెడ్డి

బోరబండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా కె.ఆదిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీజోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నుంచి బోరబండ సీఐగా వచ్చారు. ఈ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా పని చేసిన విజయ్ తిరుమలగిరికి బదిలీయ్యారు. డివిజన్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు సీఐని కలిసి అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే నాగేందర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే సురేందర్‌రెడ్డి, కాలనీవాసులు

## కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించనున్నట్టు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఫిలింనగర్ చుట్టూ ఉన్న కాలనీవాసులు సోమవారం క్యాంపు కార్యాలయంలో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తున్నప్పుడు తన దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరించేందుకు అధికారులతో చర్చిస్తానని వెల్లడించారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, నాగేశ్వరరావు, మంజుల, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, అనిత తదితరులున్నారు.

## కేబీఆర్ పార్కు వద్ద దృష్టి మరల్చి సెల్‌ఫోన్ చోరీ

● వెంబడించి పట్టుకున్న బాధితుడు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దృష్టి మరల్చి సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న నిందితుడిని ఓ మేస్త్రీ వెంబడించి పట్టుకున్నాడు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన లాల్‌చంద్ నగరంలో మూసాపేటలో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. ఈనెల 4వ తేదీన పని నిమిత్తం బంజారాహిల్స్‌కు వచ్చాడు. పని ముగించుకొని కేబీఆర్ పార్కు వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఓ ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వచ్చారు. లాల్‌చంద్‌ను ప్రశ్నించారు. అనంతరం మిత్రుడికి ఫోన్ చేసుకుంటామని లాల్‌చంద్ వద్ద సెల్‌ఫోన్ తీసుకున్నారు. ఫోన్‌లో మాట్లాడుతున్నట్టు నటించి అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే స్పందించిన లాల్‌చంద్ అరుస్తూ వారి వెంట పరుగులు తీశాడు. అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్ సహాయంతో ముగ్గురిలో ఒకరిని పట్టుకున్నాడు. అతడి పేరు ఉపేంద్ర అని తెలిసింది. అతడి ద్వారా మరో ఇద్దరు సూర్య, రాజులను పట్టుకున్నాడు. లాల్‌చంద్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కార్లపై కూలిన భారీ వృక్షం



కార్లపై కూలిపోయిన చెట్టు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో ఓ వృక్షం నేలకొరిగింది. చెట్టు పడిపోవడంతో దాని కింద పార్క్ చేసిన రెండు కార్లు, రెండు బైకులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఖైరతాబాద్ గణపతి వెనుక భాగంలోని న్యూ సీఐబీ క్వార్టర్స్‌లో రోడ్డుపై ఓ భారీ చెట్టు కింది భాగంలో చెద పట్టింది. దీంతో చెట్టు కూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు వచ్చి చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

## టీవీ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగు టెలివిజన్ - డిజిటల్ ఓటీటీ మీడియా పరిశ్రమలోని 24 క్రాఫ్ట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్, తెలుగు టెలివిజన్ డిజిటల్-ఓటీటీ ప్రొడ్యూసర్ కౌన్సిల్ చైర్మన్ ఏ.ప్రసాదరావు, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ దొర, కోశాధికారి వి.సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు కొయ్యలముడి రాకేష్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఇదే కార్యవర్గం ఫెడరేషన్‌కు పని చేస్తోందన్నారు. ఇప్పటి వరకు ఒక సొంత భవనాన్ని నిర్మించడంతో పాటు టీవీ పరిశ్రమలోని 3 వేల మందికి కేంద్రం ఈ-శ్రమ్ కార్డులు ఇప్పించినట్టు వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా పుట్ట విజయ్‌కుమార్, కోశాధికారిగా కర్ర నరేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్‌గా మోహన్‌రాజ్, ఇ.రమేష్ మాస్టర్, ఎక్స్‌క్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్‌గా సీహెచ్‌ఎస్ ప్రసాద్, ఎం.సంపత్ మడగల, జాయింట్ సెక్రటరీస్‌గా ఆర్‌సీఎం రాజు, ఎంవీవీ కృష్ణమూర్తి, మహిపాల్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.



క్రీడాకారులతో అనిల్ కుమార్‌యాదవ్

## ముగిసిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

తిరుమలగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ గ్లోబ్ వర్సెస్ హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్‌లు పోటీ పడ్డాయి. ఫైనల్లో హైదరాబాద్ గ్లోబ్ టీం విజయం సాధించింది. విజేతకు 50వేల ప్రైజ్ మనీ, రన్నర్ అప్‌కు 25 వేల ప్రైజ్ మనీని సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కన్వీనర్ రేమండ్ హర్వర్డ్, ప్యారసాని రామ్‌కుమార్‌లు అందజేశారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైఖెల్ అబ్రహం పాల్గొన్నారు.

## సినిమా టాకీస్ పై నుంచి పడి వ్యక్తి మృతి

సనత్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్‌పై నుంచి పడి బధిరుడైన వ్యక్తి మృతి చెందాడు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసాపేట్ ప్రధాన రహదారి సమీపంలో ఉన్న శశికళ సినిమా టాకీస్‌పైకి వెళ్లిన వ్యక్తి అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

● ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్



బకాయిదారులను కలిసి ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేస్తున్న యూసుఫ్‌గూడ సర్కిల్-19 అధికారులు. అందరూ సకాలంలో ట్యాక్స్ చెల్లించాలని కోరారు.

- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

# అక్షర సైనికులు

● వారాంతంలో బస్తీలో సేవలు
● ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు
● పేదల కోసం ఆరోగ్య శిబిరాలు
● వసుదైక కుటుంబం లక్ష్యంగా స్టూడెంట్ సోషల్ సర్వీస్



స్టూడెంట్ సోషల్ సర్వీస్ ప్రతినిధులు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ప్రతినిధులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చదువు.. ఫ్రెండ్స్.. ఎంజాయ్.. కాలేజీ రోజుల్లో కుర్రాళ్ల ఆలోచనలు ఇలానే ఉంటాయి. కానీ ప్రస్తుతం చాలా మంది యువతలో ఇలాంటి ఆలోచనలతో పాటు సామాజిక సేవ చేయాలనే సంకల్పం కనిపిస్తోంది. తమ చదువులకు ఒక అర్థం ఉండాలని అటువైపు అడుగులు వేస్తున్నారు. స్వామి వివేకానందుడి స్ఫూర్తితో కుర్ర దుర్గారావు స్టూడెంట్ సోషల్ సర్వీస్ పేరిట స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. లీడ్ వరల్డ్ 2050 పేరిట లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. బస్తీ ప్రజల జీవనశైలిని మార్చే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక్కడితో మొదలైన సంస్థ ఇప్పుడు అనేక మంది ప్రతినిధులు చేరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు చెప్పడం, పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు, బస్తీల్లో సమస్యలను పరిష్కరించడం ఇలా తమ దృష్టికి వచ్చి వాటిని బాగు చేస్తున్నారు సంస్థ ప్రతినిధులు.



ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం

### అంతా చదువుకున్న వారే..

ఎంత మంది ప్రజాప్రతినిధులు వచ్చినా.. ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా బస్తీలో పరిస్థితులు పూర్తిగా మారడం లేదు. ఈ క్రమంలో సంస్థలో ప్రతినిధుల సంఖ్య పెంచే దిశగా యువతలో స్ఫూర్తి కలిగించారు. బీటెక్ పూర్తయినాక ఉద్యోగం చేసుకుంటూనే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ ఇలా అనేక మంది దుర్గారావు వెంట ఉంటూ తమవంతు సాయం చేస్తున్నారు.

### పేద విద్యార్థుల చదువుకు సాయం

చదువుతోనే పేదల జీవితాలు మారుతాయని నమ్మిన స్టూడెంట్ సోషల్ సర్వీస్ ప్రతినిధులు.. బస్తీ పిల్లల్లో అక్షర చైతన్యం తీసుకొచ్చే బాధ్యతను తీసుకున్నారు. 2012లో రాత్రి బడులు నిర్వహించారు. దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నా తమ విజన్ మార్చుకోలేదు. స్వయంగా పేదల ఇళ్లకు వెళ్లి చదువులు చెప్పారు. పెద్దవారికి సంతకాలు చేయడం, పేర్లు చదవడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లోని లోపాన్ని గ్రహించి వారే వారికి సులభమైన పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, భవిష్యత్ సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలు వివరిస్తున్నారు. ఇంగ్లిష్, గణితం, కంప్యూటర్ తదితర అంశాల గురించి వీకెండ్‌లో తరగతులు తీసుకుంటారు. బస్తీప్రజల ఆరోగ్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులను సంప్రదించి ప్రతి ఆదివారం వైద్య శిబిరాలు నిర్వహిస్తూ మందులు ఉచితంగా అందజేస్తున్నారు.

### రోజుకో రూపాయి

సేవ అనగానే కొంత డబ్బు అవసరమవుతుంది. రంగారావు మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడు. రోజుకో రూపాయికి ప్రచారం కల్పించారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలకు తిరిగి రోజుకో రూపాయి చొప్పున వారానికి ఐదు రూపాయలు విరాళంగా ఇస్తే బస్తీ పేదల్లో చిరునవ్వులు చూడొచ్చని చెప్పారు. దీనికి విద్యార్థులంతా ఒప్పుకున్నారు. సంస్థ తరఫున ఓ లీడర్‌ను ఎన్నుకుని విరాళాలు సేకరించి వచ్చిన వాటితో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులకు పుస్తకాలు, బ్యాగులు, పెన్సిల్‌లు, పెన్నులు, యూనిఫారాలు, షూస్ కొనిస్తారు.

### బస్తీల్లో సమస్యలపై పోరాటం

తమ సేవలను మరింత పెంచాలని భావించిన లీడ్ వరల్డ్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బెనోవెలెంజ్ సంస్థను ఏర్పాటు చేసింది. వసుదేక కుటుంబం పేరిట ప్రతి శని, ఆదివారాల్లో బస్తీల్లో తిరుగుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యల నివేదిక తయారు వాటిని పరిష్కరించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదిస్తారు. సమస్యలను కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులనే బస్తీలకు తీసుకువచ్చి సమస్యలను వివరిస్తారు.

### అందరూ భాగస్వాములు కావొచ్చు



సమాజ సేవ చేయాలనే ఆలోచన ఉన్న యువత ఎవరైనా స్టూడెంట్ సోషల్ సర్వీస్‌లో చేరొచ్చు. ప్రజల సేవలో భాగస్వామ్యం కావొచ్చు. రూపాయి నినాదాన్ని మరింత విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలలే కాకుండా జిల్లాలో ఉన్న విద్యార్థుల నుంచి రోజుకో రూపాయి విరాళంగా సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. అనేక బస్తీల్లో చీకట్లో ఉండిపోతున్నాయి. అక్కడ వెలుగులు ప్రసరింపచేసేలా చదువుకున్న వారు చొరవ తీసుకుంటే బాగుంటుంది. - కుర్ర దుర్గాప్రసాద్

## ఒకేషనల్ విద్యలో అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న రాపోలు భాస్కర్

పంజాగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం కింద జిల్లా పరిషత్ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సుల బోధనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిధులతో రాష్ట్ర విద్యాలయాల్లో ఒకేషనల్ విద్య కొనసాగుతోందన్నారు. శిక్షణ సంస్థల ఎంపికలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. అర్హత లేని సంస్థలను శిక్షణ కోసం ఎంపిక చేసి, కోట్లాది రూపాయలు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి అవకతవకలను సరిచేయడంతో పాటు బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మొత్తం 492 జిల్లా పరిషత్ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. అర్హత లేని సంస్థలకు, ఏజెన్సీలకు శిక్షణ బాధ్యతలు అప్పగిస్తే వారు విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలపై ఏసీబీ డీజీకి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన, తదితరులకు వినతిపత్రం ఇవ్వడం ఇచ్చామని తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అమీర్‌పేట చాట్‌బండార్ వద్ద ఘటన



పురుషోత్తం మృతదేహం

పంజాగుట్ట, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరిలో ఉపాధి లేక పొట్ట చేత పట్టుకొని నగరానికి వలస వచ్చారు ఇద్దరు. అమీర్‌పేటలోని ఓ చాట్ బండార్, జ్యూస్ దుకాణంలో పని చేస్తున్నారు. పని పూర్తి అయిన తర్వాత గ్రైండర్, సామాను శుభ్రం చేస్తుండగా ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని రక్షించబోయి మరో యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ పురుషోత్తంను ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి అమీర్‌పేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవరెడ్డినగర్‌కు చెందిన చరణ్‌జ్యోత్ సింగ్ అమీర్‌పేట ఎలిఫెంటా టవర్స్ వద్ద పూజా చాట్ బండార్, జ్యూస్ బండిని ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సందీప్ లీజుకు తీసుకున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పురుషోత్తం(18) 20 రోజుల క్రితం పని చేయడానికి వచ్చాడు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పురుషోత్తం సామన్లను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాగానికి గురయ్యాడు. దీనిని గమనించి అక్కడే పనిచేస్తున్న చింటూయాదవ్ అతడిని రక్షించడానికి కర్రతో కొట్టే క్రమంలో అతనికి కూడా షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడ్డ పురుషోత్తంను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. యజమాని నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు చాట్ బండార్ యజమాని చరణ్ జ్యోత్‌సింగ్, లీజుకు తీసుకున్న సందీప్‌లపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అల్వాల్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

మచ్చబొల్లారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అల్వాల్ జేజే నగర్‌కాలనీ వాసులు ఆ ప్రాంతంలో చెత్తవేయడంతో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో ఎలాంటి ఆస్తినష్టం జరగలేదు.

## అకౌంట్ నుంచి రూ.1,49,997 మాయం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి రూ.1,49,997 తస్కరించిన సంఘటన మేడ్చల్ జిల్లా పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోచారం సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మునిసిపల్ ఇస్మాయిల్ ఖాన్‌గూడలో ఉండే ఓ రిటైర్డ్ ఉద్యోగి(71)కి నగరంలోని తార్నాకలో గల ఓ బ్యాంకులో సేవింగ్ అకౌంట్ ఉంది. జనవరి 26న గుర్తుతెలియని వ్యక్తి ఆయనకు ఫోన్‌చేసి 'మీ బ్యాంకు ఖాతాను అప్‌డేట్ చేయాలి, ఓటీపీ వస్తుంది అది చెప్పాలి' అని అన్నాడు. నిజమని నమ్మిన రిటైర్డ్ ఉద్యోగి సదరు వ్యక్తి అడిగిన ఓటీపీలను మూడుసార్లు చెప్పాడు. దీంతో అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.49,999 చొప్పున మూడుసార్లు మొత్తం రూ.149,997 ఖాళీ అయ్యాయి. తన బ్యాంకు నుంచి నగదు తస్కరించిన విషయం గుర్తించి బాధితుడు వెంటనే సదరు నెంబర్‌కు కాల్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామాల బంద్



సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

కుషాయిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామాల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోస పూరిత ప్రకటనలతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను మభ్య పెట్టడం ఇకముందు సాధ్యం కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.చంద్రశేఖర్, బి.వి.సత్యనారాయణ, జి.శ్రీనివాసులు, ఎపిరా కంపెనీ యూనియన్ నాయకులు సీహెచ్ వీరయ్య, శివ, ఎం.డి.రసూల్, కోదండ రాముడు, నారాయణ, శివ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ఏఎస్‌రావునగర్: ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కమలాగర్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.శంకర్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, నాయకులు జి.దామోదర్‌రెడ్డి, మిరియాల సాయిలు పాల్గొన్నారు.

## 'విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న శిశువిహార్ ఆయాలపై పోలీసులకు ఫిర్యాదు'

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించి చిన్న పిల్లల గాయాలు తీవ్రం కావడానికి కారణమైన ఆయాలపై చర్యలు తీసుకోవాలని శిశువిహార్ ఇన్‌చార్జి మధురానగర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంగణంలో శిశువిహార్ కొనసాగుతోంది. తల్లిదండ్రులు లేని చిన్న పిల్లల్ని ఇక్కడ సంరక్షిస్తుంటారు. వీరి ఆలనాపాలనా బాధ్యత చూసుకునేందుకు ఆయాలను ఏర్పాటు చేశారు. అయితే గత నెల 7వతేదీన ఆరేళ్ల బాలుడి ముక్కు, ముఖం వాచి ఉండటాన్ని అధికారులు గమనించి ఆసుపత్రికి తీసుకువెళ్లగా ముక్కులో పుండు ఉందని, ఈఎన్‌టీ వైద్యులకు చూపించాలని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల కోసం సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా 4వతేదీ గాయపడిన బాలుడిని మరో బాలుడు నెట్టడంతో కిందపడి గాయపడ్డాడని, అక్కడే విధుల్లో ఉన్న ఆయా పుష్పలత పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉండడమే కాకుండా కార్యాలయంలో సమాచారం ఇవ్వలేదని తెలిపారు. గత నెల 18న మరో బాలుడి అంగం వద్ద గాయమైంది. ఇది గమనించిన అధికారులు వైద్యం చేయించారు. ఈ సంఘటన గురించి సీసీ టీవీ పరిశీలించగా గాయపడిన బాలుడిని మరో బాలుడు కొరకడం వల్ల ఇలా జరిగిందని, అక్కడే ఉన్న ఆయా కిష్టమ్మ పట్టించుకోలేదని తేలింది. ఈ రెండు సంఘటనల్లో ఆయాలు నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్ల పిల్లలు బాధపడాల్సిన పరిస్థితి వచ్చిందని అధికారులు నిర్ధారించారు. ఆ ఇద్దరు ఆయాలను శిశువిహార్ ఇన్‌చార్జి సంతోషి విధుల నుంచి తొలగించటమే కాకుండా వారిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

● మిస్, మిస్సెస్ సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే..



వీనస్ - స్టార్ లైట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మిస్, మిసెస్ సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే వేడుకలు సోమాజిగూడలోని ఓ హోటల్లో ఆదివారం రాత్రి సాగాయి. యువతులతో పోటీగా మహిళలు విభిన్న డ్రస్సులతో వాక్ చేస్తూ కనువిందు చేశారు. ప్రముఖ సినీనటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ వేడుకలను ప్రారంభించారు. న్యాయనిర్ణేతలుగా సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, పలు అందాల పోటీల విజేతలు ఉషా ప్రసాద్, ప్రియాంక సర్కార్, సోనిభట్, సుధాజైన్ వ్యవహరించారు. మిస్ సౌత్ ఇండియాగా సునీత, రన్నరప్‌గా మహాలక్ష్మి, మిసెస్ సౌత్ ఇండియాగా చరిత, రన్నరప్‌గా అష్మి గెలిచారు.

- పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి

## పది ఎంపీ స్థానాలు గెలుస్తాం: లక్ష్మణ్

నార్సింగ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గావ్ చలో.. ఘర్ చలో కార్యక్రమాన్ని హైదర్షాకోట్ మైత్రీవనంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణలో 10 పార్లమెంట్ సీట్లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోరు ఉంటుంద న్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఎవరూ నమ్మడం లేదన్నారు. 370 ఆర్టికల్, రామాలయం, త్రిపుల్ తలాక్ వంటి అనేక కార్యక్రమాలు ప్రధాని మోదీ విజయవంతం చేశారన్నారు. అయోధ్యను ప్రపంచ ఆధ్యాత్మిక దేవాలయంగా మారుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవీఎన్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎస్.రత్నం, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





దాడుల్లో స్వాధీనం చేసిన మందులు

## యునానీ ఫార్మసీపై దాడులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్ల తొలగిస్తామంటూ... కిడ్నీ సంబంధిత వ్యాధులకు నిషేధిత ప్రకటనలిచ్చి చికిత్స చేస్తున్న ఆర్ఎస్ యునానీ ఫార్మసీ కేంద్రంపై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం బహదూర్‌పురాలో ఉన్న ఆర్ఎస్ యునానీ ఫార్మసీలో సోదాలు నిర్వహించి భారీగా మందులు, రెనెసిప్ డ్రాప్స్ స్వాధీనం చేసుకున్నారు. యునానీ ఫార్మసీ పేరిట తయారు చేస్తున్న 'యూనీ స్టోన్స్' పౌడర్ ప్రకటనలో కిడ్నీ సమస్యలను దూరం చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తించారు.

## వర్సిటీలో గజం స్థలం కూడా వదులుకోం

● విద్యార్థులకు మద్దతు పలికిన బీజేవైఎం ● రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం విస్తరణ : మహేందర్



నిరసనలు తెలుపుతున్న విదార్థులు, బీజేవైఎం కార్యకర్తలు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ వర్సిటీ స్థలాన్ని ఇతర సంస్థలకు కేటాయించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు చేపడుతున్న ఆందోళనకు బీజేవైఎం మద్దతు పలికింది. యూనివర్సిటీలోని 100 ఎకరాల స్థలాన్ని హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 55ని ప్రతిపాదించిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు 28 రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే.. వారి నిరసనలకు సంఘీభావంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్‌తో పాటు ఇతర కార్యకర్తలు సోమవారం నిరసనలో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. వి ద్యార్థుల నిరసన కార్యక్రమాన్ని అభినందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. యూనివర్సిటీలో ఒక్క ఇంచు జాగా కూడా వదులుకోబోమని... యూనివర్సిటీలో బుల్డోజర్ అడుగుపెట్టాలంటే ముందు విద్యార్థుల మీద నడిపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రక్తాన్నైనా చిందిస్తాం.. యూనివర్సిటీ భూములు వదులుకోబోమని నినదించారు. తెలంగాణకే తలమానికమైన ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ కేవలం విద్యార్థులకు మాత్రమే కాదు.. రాష్ట్రంలోని అనేక మంది రైతులకు ఆధారంగా, నూతన వంగడాలకు, వ్యవసాయ విధానాలకు ఓ ప్రధాన కేంద్రంగా ఉందన్నారు. అనంతరం ప్రభుత్వానికి నాలుగు రోజుల అల్టిమేటం ఇస్తున్నట్లు ప్రకటించి.. జీఓ నెంబర్ 55ని రద్దు చేయకపోతే ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఈ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని మహేందర్ హెచ్చరించారు.

## లాలాగూడ పోలీస్ స్టేషన్ సీఐగా పల్లె పద్మ



బాధ్యతలు చేపడుతున్న పల్లె పద్మ

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** ఈస్ట్‌జోన్ లాలాగూడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పల్లె పద్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మీడియాతో మాట్లాడుతూ.. తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ఎలాంటి గొడవలకు తావు లేకుండా నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా సరే నేరాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రశాంత వాతవరణం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆమె గతంలో మారేడుపల్లి పోలీస్ స్టేషన్‌లో డీఐ, సుల్తాన్‌బజారు పోలీస్ స్టేషన్‌లో సీఐగా సీసీఎస్‌లో విధులు నిర్వహించారు. ఇదివరకు లాలాగూడ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వర్తించిన మధులత సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.


పి.మురళిధర్‌రావుకు శాతవాహనం కాలం నాటి నాణేమును బహుకరిస్తున్న ముశం దామోదర్ రావు

## ప్రగతి బాటలో భారత్

- **బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళిధర్ రావు**

**మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యే విధంగా ఉంటున్నాయని మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి పి.మురళిధర్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి కంటోన్మెంట్ లలితానగర్ కాలనీలో 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చా కో కన్వీనర్ ముశం దామోదర్‌రావు, రాము అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న కార్యక్రమాలను స్థానికులకు వివరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు రాజశ్రీ, జయశ్రీ, సాయిశంకర్ తదితరులు

## ఘనంగా వైద్యాధికారికి వీడ్కోలు సభ

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్‌లోని లాలాపేట్ క్లస్టర్ వైద్యాధికారి రాజశ్రీ చార్మినార్ ప్రభుత్వ ఆస్పత్రికి డిఎంహెచ్‌ఓగా వెళ్తున్న సందర్భంగా సోమవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో ఎస్‌పిహెచ్‌ఓ అధికారిని జయశ్రీ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ డివిజన్‌లో పదేళ్లుగా ప్రజాసంక్షేమ కోసం సేవ చేసి పదోన్నతిపై వెళ్తున్న డాక్టర్ రాజశ్రీకి ఆయా ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ నర్సులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. డాక్టర్ రాజశ్రీ సికింద్రాబాద్‌లోని బైబిల్ హౌజ్, గరీబజారు, పొల్డాస్ ఆరు బస్తీదవఖానాలో విధులు నిర్వహించడం గొప్ప విషయమని పలువరు వక్తలు ప్రసంగించారు.


క్రీడాకారులతో అనిల్ కుమార్ యాదవ్

## ముగిసిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

**తిరుమలగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ గ్లోబ్ వర్సెస్ హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్‌లు పోటీ పడ్డాయి. ఫైనల్లో హైదరాబాద్ గ్లోబ్ టీం విజయం సాధించింది. విజేతకు 50వేల ప్రైజ్ మనీ, రన్నర్ అప్‌కు 25 వేల ప్రైజ్ మనీని సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్, ప్యారసాని రామ్‌కుమార్‌లు అందజేశారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైఖెల్ అబ్రహంలు పాల్గొన్నారు.



యోగా కాంపిటేషన్‌లో బంగారు పతకాలు సాధించిన చిన్నారులు

## యోగా కాంపిటేషన్‌లో చిన్నారులకు బంగారు పతకాలు

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణలోని బెల్లంపల్లిలో జరిగిన ఇంటర్‌నేషనల్ యోగా పోటీలో హైదరాబాద్ అల్వాల్ సెయింట్ మైఖెల్ స్కూల్‌కు చెందిన 11 మంది చిన్నారులు బంగారు సిల్వర్ పథకాలు సాధించారని తుకారాంగేట్‌కు చెందిన యోగా కోచ్ హరికృష్ణనాయక్ తెలిపారు. అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో జరిగిన యోగా పోటీలో బాలురులో 3వ స్థానంలో యాస్‌నల్లా, ప్రణవ్ ఓంకార్ రెడ్డి, జోర్థాన్ డానియల్, బాలికలో హన్సిక బ్రోంజ్ మెడల్ పతకాలు సాధించారు. మొదటి స్థానంలో అన్యా, ఆరాధ్య, సితారారెడ్డి, రిషత్ బంగారు పతకాలు సాధించగా.. రెండో స్థానంలో వసుద, శ్రీవరుణ్ రాపల్లేలు సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు.


సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్‌ఎస్వీ విద్యార్థులు

## ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**తార్నాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ బీఆర్‌ఎస్వీ విద్యార్థి నాయకులు సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ కృష్ణా జలాల్లో యాభై శాతం రాష్ట్రానికి సాధించేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ విద్యార్థి నాయకులు మిథున్, రామకృష్ణ, నాంగేందర్ రావు, అవినాష్, శ్రీను నాయక్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌లో కలుషిత నీరు

- పట్టించుకోని నీటి విభాగం అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పికెట్ లక్ష్మీనగర్ బస్తీవాసులు


కలుషిత నీటిని బాటిళ్లలో పట్టి చూపుతున్న బస్తీవాసులు

**మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** కలుషిత నీటి సరఫరాతో రోగాల బారిన పడుతున్నా కంటోన్మెంట్ బోర్డు నీటి విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని బోర్డు నాలుగో వార్డు పరిధిలోని పికెట్ లక్ష్మీనగర్ బస్తీవాసులు మండి పడుతున్నారు. బస్తీలోని నాగమైసమ్మ ఆలయం పక్క గల్లీలో 4-16-170 ఇంటి నంబర్ వద్ద కొద్ది రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుంది. ఈ విషయాన్ని కంటోన్మెంట్‌బోర్డు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినప్పటికీ సమస్యను పరిష్కరించలేదని ఆరోపిస్తున్నారు. బస్తీలో దాదాపు నాలుగు వేల మంది ఓటర్లు ఉన్నారు. చిన్న చిన్న గల్లీలు పదుల సంఖ్యలో ఏర్పడ్డాయి. చిన్న గల్లీలో డ్రైనేజి పైపు లైన్ ఏర్పాటు చేసిన పక్కనే తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్లు ఉండడం కారణంగా ఈ సమస్య ఉత్పన్నమవుతుందని వారు పేర్కొన్నారు. తరచూ డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో మురుగు నీరు నిండి పొంగి పొర్లుతుందని, దీంతో తాగునీటి పైప్‌లైన్లలో మురుగు నీరు కలిసి కలుషితమై సరఫరా అవుతుందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి మురుగు నీటి సమస్యతో పాటు కలుషిత నీటి నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### చర్యలు తీసుకోండి..



లక్ష్మీనగర్ బస్తీలో కొద్ది రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నది. దుర్వాసనతో కూడిన మురుగు నీరు కలిసి సరఫరా అవుతున్నది. రోగాల బారిన పడుతున్నాం. మరొక ప్రాంతానికి వెళ్ళి నీటిని తెచ్చుకుంటున్నాం. నివారణ చర్యలు చేపట్టాలి.

- ఎన్.రాజు, బస్తీ నివాసి

### తాగలేకపోతున్నాం..



మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. కలుషిత నీటిని తాగలేకపోతున్నాము. దీంతో బయట నుంచి క్యాన్లలో నీటిని డబ్బులు చెల్లించి తెచ్చుకుంటున్నాము. పక్కనే ఉన్న ఓపెన్ మురుగునీటి భారీ కాలువతో వస్తున్న దుర్వాసన, దోమల విజృంభన సమస్యలతో సతమతమవుతున్నాం. దీనికి తోడు కలుషిత నీరు సరఫరా కావడం పట్ల ఆందోళన చెందవలసిన పరిస్థితి నెలకొంది. బస్తీలో అధికారులు పర్యటించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాం.

- రేణుక, బస్తీ స్థానికురాలు


మురుగునీరు నివారణ చర్యలు ప్రారంభించిన అధికారులు

## మురుగునీటి నివారణ చర్యలు

**బోయినపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్‌బోర్డు ప్రాంతంలోని బోయినపల్లి ఒకటో వార్డులోని చిన్నతోకట్ట నక్కలపల్లి వెల్ఫేర్ అసోసియేషన్‌లో కొన్ని రోజులుగా మంచినీటి పైపులైన్‌లో మురుగునీరు కలిసి కలుషితనీరు సరఫరా అవుతున్నది. దీంతో స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో ఈ విషయాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన అధికారులు సోమవారం ఈ ప్రాంతంలో పర్యటించి కలుషితనీరు సరఫరా అవుతున్న ప్రాంతాన్ని గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతంలో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించారు.

# వర్సిటీలో గజం స్థలం కూడా వదులుకోం

- విద్యార్థులకు మద్దతు పలికిన బీజేవైఎం
- నాలుగు రోజుల అల్టిమేటం ఇచ్చిన అధ్యక్షుడు మహేందర్


నిరసనలు తెలుపుతున్న విదార్థులు, బీజేవైఎం కార్యకర్తలు

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీ స్థలాన్ని ఇతర సంస్థలకు అప్పగించడం పట్ల కొనసాగుతున్న విద్యార్థుల నిరసనకు బీజేవైఎం మద్దతు పలికింది. యూనివర్సిటీలోని 100 ఎకరాల స్థలాన్ని హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 55ని ప్రతిపాదించిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు గత 28 రోజులుగా ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. వారి నిసరనలకు సంఘీభావంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్‌తో పాటు ఇతర కార్యకర్తలు సోమవారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల నిరసన కార్యక్రమాలను, ఉద్యమాన్ని అభినందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. యూనివర్సిటీలో ఒక్క ఇంచు జాగాను కూడా వదులుకోమని.. బుల్డోజర్ యూనివర్సిటీలో అడుగుపెట్టాలంటే ముందు విద్యార్థుల మీద నడిపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రక్తాన్నైనా చిందిస్తాం కానీ యూనివర్సిటీ భూములు వదులుకోమన్నారు. తెలంగాణకే తలమానికమైన ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ కేవలం విద్యార్థులకు మాత్రమే కాదు.. రాష్ట్రంలోని అనేక మంది రైతులకు ఆధారంగా నూతన వంగడాలకు, నూతన వ్యవసాయ విధానాలకు ఓ ప్రధాన కేంద్రంగా ఉందని అన్నారు. అనంతరం ప్రభుత్వానికి నాలుగు రోజుల అల్టిమేటం ఇస్తున్నట్లు ప్రకటించి... జీఓ నెంబర్ 55ని రద్దు చేయకపోతే ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఈ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని మహేందర్ హెచ్చరించారు.



ఢిల్లీలో ఈనెల 6న సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ అంశంపై జరిగే ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక చర్చల్లో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ సోమవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి వెళ్ళారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు డప్పు మల్లికార్జున్, నర్సింగ్‌రావులతో పాటు పలువరు నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

## విద్యుత్ షాక్ తో యువకుడి మృతి

- ఒకరికి గాయాలు
- అమీర్‌పేట పూజా చాట్ బండార్ వద్ద ఘటన
- నిర్వాహకులపై కేసు నమోదు

**పంజాగుట్ట, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి):** పుట్టిన ఊరిలో ఉపాధి లేక.. పొట్ట చేత పట్టుకొని నగరానికి వలస వచ్చారు ఇద్దరు. అమీర్‌పేటలోని ఓ చాట్ బండార్, జ్యూస్ దుకాణంలో పనిచేస్తున్నారు. పని పూర్తి అయిన తర్వాత గ్రైండర్, గిన్నెలను శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు ఓ యువకుడు గురయ్యాడు. అతనిని రక్షించబోయి మరో యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ యువకున్ని ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి అమీర్‌పేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవరెడ్డినగర్‌కు చెందిన చరణ్ జ్యోత్ సింగ్ అమీర్‌పేట ఎలిఫెంటా టవర్స్ వద్ద పూజా చాట్ బండార్, జ్యూస్ బండి నిర్వహిస్తున్నాడు. దానిని కొద్ది రోజుల క్రితం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సందీప్ అనే వ్యక్తి లీజుకు తీసుకున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పురుషోత్తం(18) 20 రోజుల క్రితం పనిచేయడానికి వచ్చాడు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పురుషోత్తం సామన్లను శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీనిని గమనించి అక్కడే పనిచేస్తున్న చింటూ యాదవ్ అతన్ని రక్షించడానికి కర్రతో కొట్టే క్రమంలో అతనికి కూడా షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడ్డ పురుషోత్తంను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. యజమాని నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు చాట్ బండార్ యజమాని చరణ్ జ్యోత్ సింగ్, లీజుకు తీసుకున్న సందీప్‌లపై పంజాగుట్ట పోలీసులు ఐపీసీ 304(ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** ఓ వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి - లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారమందుకున్న రైల్వేపోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి

**తిరుమలగిరి ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ బ్యాంకు ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రామకృష్ణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాపుపల్లి బృందావన్ కాలనీకి చెందిన వెంకటేశ్వరరెడ్డి (58) శామిర్‌పేట్ తుంకుంటలోని బరోడా బ్యాంక్‌లో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం యథావిధిగా తన ద్విచక్ర వాహనంపై డ్యూటీకి బయలు దేరారు. బొల్లారం చెక్ పోస్టు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. స్థానికుల సమాచారం మేరకు పోలీస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరెడ్డిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు చెప్పారు.


మేడిబావిలో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

## మేడిబావిలో రోడ్ల పనుల పరిశీలన

**బౌద్ధనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావిలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ, అధికారులు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డుపనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుమారు ముప్పై లక్షల రూపాయల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.


మడ్‌ఫోర్టులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం

## పేద ప్రజలకోసం ఉచిత వైద్యశిబిరం

**బోయినపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):** పేద ప్రజలకు వైద్యం అందించాలనే సంకల్పంతో పల్లవి ఫౌండేషన్, పల్లవి విద్యాలయాల చైర్మన్ ఆధ్వర్యంలో సేవాకేర్ ఆస్పత్రి సహకారంతో సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మడ్‌ఫోర్టు గుడిసెల వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది రోగులకు ఉచితంగా వైద్యసేవలు చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డా.హాసిని చిట్టపరెడ్డి పాల్గొని ఉచితంగా వైద్యసేవలు అందించారు.

## కంప్యూటర్ సైన్స్ విభాగంలో కృష్ణ చైతన్యకు డాక్టరేట్



**తార్నాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** కరీంనగర్ జిల్లా కోహెడ మండలానికి చెందిన కృష్ణ చైతన్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఓయూలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి పర్యవేక్షణలో రీ యూజబుల్ కాంపోనెంట్ రిట్రీవల్ ఫ్రమ్ ఆప్టిమైజ్డ్ రేపాజిటరీ యూజింగ్ న్యూరల్ నెట్‌వర్క్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గానూ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు సోమవారం ఆయన తెలిపారు. డాక్టరేట్ పట్టాను అందుకున్న కృష్ణ చైతన్యను పలువురు ఓయూ ప్రొఫెసర్లు, పరిశోధనా విద్యార్థులు అభినందించారు.

# ప్రోత్సాహంతోనే ప్రతిభ వెలుగులోకి



నాట్యగురువు తులసిని సన్మానిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి, జనార్దనమూర్తి తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ప్రోత్సాహం అవసరమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి పుట్టినరోజు వేడుకలు ప్రారంభమయ్యాయి. జస్టిస్ శేషశయనారెడ్డి మాట్లాడుతూ.. రమణాచారి పుట్టినరోజు వేడుకలు పండుగలా వివిధ సంస్థలు నిర్వహిస్తున్నాయని, ఇది ఆయనకు కళాకారుల పట్ల ఉన్న ప్రేమకు కారణమన్నారు. పిల్లల్లో ఉన్న ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ఎందరికో సహాయపడిన రమణాచారి పదవీ విరమణ అనంతరం కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కళాపోషకులు గుది బండి వెంకటరెడ్డి, నాట్యగురువు తులసి పాల్గొన్నారు. సభానంతరం తులసి శిష్యబృందం శాస్త్రీయనృత్యాలు చేశారు.

## మాదిగ ఉద్యమకారులకు రెండు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలి

- **దళిత, క్రైస్తవ దండోర జాతీయ కన్వీనర్ ప్రొ. గాలి వినోద్ కుమార్**


మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్

**తార్నాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మాదిగ ఉద్యమకారులకు రెండు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని దళిత, క్రైస్తవ దండోర జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ ఉద్యమకారులకు వరంగల్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానాలను కేటాయించడంతో పాటు, ఒక రాజ్యసభ స్థానాన్ని ఇవ్వాలని కోరారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన మాదిగ సాహితివేత్త అందేశ్రీ గీతాన్ని రాష్ట్రీయ గీతంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడిచేసిన నిందితులకు రిమాండ్

**కవాడిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌పై దాడిచేసిన నిందితులను దోమలగూడ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ట్యాంక్‌బండ్ చిల్డ్రన్స్ పార్కువద్ద ఆదివారం ఫారూక్‌నగర్ డిపోకు చెందిన బస్సు చాంద్రాయణగుట్ట నుంచి రాణిగంజ్ డిపోవైపు వెళ్తోంది. కండకర్ వి. రమేష్, డ్రైవర్ షేక్ అబ్దుల్ అమీన్‌షాపై బోయినపల్లి నివాసి ఎండీ మాజిద్, తాడ్‌బంద్ నివాసి మహ్మద్ ఖాసిం చిల్డ్రన్స్ పార్కు వద్ద బస్సు ఆగగానే అకారణంగా క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశారు. కండక్టర్ రమేష్ ఎడమచేయి విరిగింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు.

## పెంపుడు కుక్కను ఢీకొట్టిన యువకుడిపై కేసు

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** కారు ఢీకొని పెంపుడు కుక్కకు తీవ్రమైన గాయాలయ్యాయి. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన రాహుల్ (28) కారులో సోమవారం బర్కత్‌పుర చౌరస్తా నుంచి కాచిగూడ వెళ్తున్నాడు. మార్గమధ్యంలో భూమన్నలేన్‌లో పెంపుడు కుక్కను ఢీకొట్టాడు. కుక్క తల, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. కుక్క యజమానురాలు మీనాకుమారి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు రాహుల్‌పై కేసు నమోదు చేశారు.

## రైలులో చోరీ

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** రైలులో చోరీ జరిగింది. ఓ ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియిన వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్ గంగపూరి ప్రాంతానికి చెందిన కాశీప్రసాద్ సోని కుమార్తె నకుల్ సోని (32) జైపూర్ రైలులో కాచిగూడకు వస్తోంది. మార్గమధ్యంలో మండకడ్ రైల్వే స్టేషన్ సమీపంలో రూ. 40,500, గ్రాము బంగారు ఆభరణం, ఖరీదైన సెల్‌ఫోన్ ఉన్న ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలు సోమవారం రాత్రి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గ్రంథాలయాలు జ్ఞానసముపార్జన కేంద్రాలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయాలు జ్ఞానసముపార్జన కేంద్రాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ.. తన జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేసిన ఆళ్వారుస్వామి సదా చిరస్మరణీయులన్నారు. గ్రంథాలయ ఉద్యోగులు వెంకటేష్‌యాదవ్, శ్రీకాంత్, ముత్యం, వెంకటేష్ రెడ్డి, చంద్రకళ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.